నమస్తే తెలంగాణ
# నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 4 జనవరి 2024 | NIRMAL



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

## విద్యార్థులు ఇష్టపడి చదవాలి..

### పక్కా ప్రణాళికతో చదివితే మంచి మార్కులు వస్తాయి..

- 10 జీపీ సాధించేలా సన్నద్ధం చేయాలని అధికారులకు సూచన
- నిర్మల్ జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి
- భైంసా, కుంటాల మండలాల్లోని పాఠశాలల తనిఖీ

భైంసా టౌన్/కుంటాల, జనవరి 3 : పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదవాలని నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం భైంసా మండలంలోని వానల్‌పాడ్, కుంటాల మండలంలోని లింబా(కే) జిల్లా పరిషత్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికలు రూపొందించుకుని చదవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా చూడాలని, 10 జీపీ సాధించేలా సన్నద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఎస్పీల బదిలీ

- ఉదయ్ కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌లకు స్థానచలనం
- ఆదిలాబాద్ జిల్లాకు కొత్త ఎస్పీగా గౌస్ ఆలం
- నిర్మల్ జిల్లాకు జానకీ షర్మిల



ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం  నిర్మల్ ఎస్పీ జనకి షర్మిల

ఆదిలాబాద్(నమస్తే తెలంగాణ)/నిర్మల్ చైన్‌గేట్, జనవరి 3 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఎస్పీలు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయ్‌కుమార్‌రెడ్డిని తెలంగాణ ట్రాన్స్‌కో ఎస్పీగా, ప్రవీణ్‌కుమార్‌ను ఎల్బీనగర్ డీసీపీగా బదిలీ చేసింది. ఆదిలాబాద్ జిల్లాకు ములుగు జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న గౌస్ ఆలం, నిర్మల్ జిల్లాకు తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జానకీ షర్మిల వస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా ఉదయ్‌కుమార్‌రెడ్డి డిసెంబర్ 27, 2021న బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతలు కాపాడడంతోపాటు మట్కా, గుట్కా, రోడ్డు ప్రమాదాల నివారణకు విశేషంగా కృషి చేశారు. అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు.



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

# గెలుపు బీఆర్‌ఎస్‌దే..

### నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి..

- కాంగ్రెస్ హామీలను ప్రజలకు వివరించాలి..
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

ఆదిలాబాద్, జనవరి 3(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానాన్ని బీఆర్‌ఎస్ పార్టీ భారీ మెజారిటీతో కైవసం చేసుకుంటుందని, ఈ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గులాబీ శ్రేణులు ఓటమితో నిరాశ చెందకుండా ఆత్మస్థైర్యంతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు మెజారిటీ వచ్చిందని, ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. లోకసభతోపాటు స్థానిక, మున్సిపల్ ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలు ముగిసిన అనంతరం అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా సమావేశాలు ఉంటాయని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీని సంస్థాగతంగా గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు వేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి బలోపేతం చేస్తామని సూచించారు.

### అందరితో చర్చించి అభ్యర్థుల ప్రకటన

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఓటమి గల కారణాలను విశ్లేషించుకుని, లోపాలను సవరించుకుని ముందుకు పోదామని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు తెలంగాణ ఎంపీల గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. తెలంగాణ ప్రయోజనాలకు శ్రీరామ రక్ష బీఆర్‌ఎస్ పార్టీయే అని తెలుపాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించడానికి గులాబీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విషయాన్ని ప్రజలు వివరించాలని సూచించారు. ఎంపీ అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో చర్చించి వారి అభిప్రాయాల మేరకు అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలను ఇచ్చిందని, హామీల పుస్తకాన్ని అందరికీ అందజేస్తామని, వాటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల గ్లోబల్ ప్రచారాన్ని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని, పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఆసిఫాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు



షీ టీం సభ్యులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

## విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలి..

### షీటీం సభ్యులకు ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచన

ఎదులాపురం, జనవరి 3 : షీ టీం సభ్యులు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో షీ టీం సభ్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రెండు షీ టీం బృందాలు విధులు నిర్వహిస్తున్నాయని, గతేడాది 438 కార్యక్రమాలు నిర్వహించి 55,920 మందికి అవగహన కల్పించామని గుర్తు చేశారు. ఈ యేడాది పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, రద్దీ ప్రాంతాల్లో మత్తు పదార్థాల నివారణ, సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నవీన పద్ధతులు, సామాజిక మాధ్యమాల ద్వారా యువత మోసపోతున్న తీరుపై అవగాహన కల్పిస్తామన్నారు. డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్ జీ, సీఐ రవీందర్, సీసీ దుర్గం శ్రీనివాస్, షీ టీం సభ్యులు పాల్గొన్నారు.



ప్రజాపాలనలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

## 'ప్రజాపాలన' నిరంతరం ప్రక్రియ

- నాలుగు రోజుల్లో లక్షకుపైగా దరఖాస్తుల స్వీకరణ
- రేషన్‌కార్డు లేనివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
- గ్రామసభల్లో అర్జీలు ఇవ్వనివారు తర్వాత అధికారులకు ఇవ్వవచ్చు..
- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఆదిలాబాద్ పట్టణం, తాంసి మండలాల్లో పర్యటన

ఎదులాపురం/తాంసి, జనవరి 3 : ప్రజాపాలన కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, రేషన్‌కార్డు లేనివారు అట్టి కాలంలో లేదని, ఆధార్ కార్డులోని వివరాలను పూరించి సమర్పించవచ్చని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడ, తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాలుగు రోజుల్లో లక్షకు పైగా దరఖాస్తులు వచ్చాయని.. గ్రామ, వార్డుసభల్లో దరఖాస్తులు సమర్పించని వారు, తర్వాత రోజు అధికారులకు అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, సీపీవో వెంకటరమణ, ఎంపీడీవో భూమయ్య, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ, సర్పంచ్ అండె అశోక్ పాల్గొన్నారు.

## ఎముకలు కొరికే చలిలో ఆధార్ కోసం..

### ఆదిలాబాద్ జిల్లాలో ఉదయం నుంచి పడిగాపులు



ఆదిలాబాద్ జిల్లా మావల తహసీల్దార్ కార్యాలయంలోని ఆధార్ సెంటర్ వద్ద బుధవారం ఉదయం ఆరు గంటలకు చలిలో పడిగాపులు కాస్తున్న జనం

ఆదిలాబాద్, జనవరి 3(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు ఆధార్‌కార్డు తప్పనిసరి చేయడంతో ప్రజలు తమ కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఆధార్ కేంద్రాల వద్ద భారీ సంఖ్యలో తెల్లవారక ముందు నుంచి కేంద్రాలకు చేరుకుని ఉదయం 5.30 గంటల నుంచి పడిగాపులు కాస్తున్నారు. చెప్పులు క్యూలైన్‌లో పెడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలను చలి వణికిస్తుండగా..10 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం మావల తహసీల్దార్ కేంద్రంలో ఉదయం 6 గంటలకు వృద్ధులు, పిల్లలతో వారి కుటుంబసభ్యులో ఆధార్ కేంద్రంలో ఎముకలు కొరికే చలిలో వచ్చి క్యూ కట్టారు. ఇక్కడ ఆధార్ కేంద్రం 10 గంటలకు తీస్తారని ఉదయం వస్తే తమకు నంబరు ఇస్తారని నాలుగైదు రోజుల తర్వాత వచ్చి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని జనం తెలిపారు. తాను నాలుగు రోజులు నుంచి వస్తున్నా నంబరు ఇవ్వడం లేదని అందుకే ఉదయం 5 గంటలకు బయలుదేరి 6 గంటల వరకు మావల ఆధార్ కేంద్రానికి చేరుకున్నాని పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన దేవమ్మ అనే వృద్ధురాలి తెలిపింది. ఆధార్ ఇబ్బందులు తొలగించడానికి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కేటీఆర్‌ను కలిసిన జాన్సన్ నాయక్



కేటీఆర్‌తో జాన్సన్ నాయక్

ఉట్నూర్, జనవరి 3 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును ఆ పార్టీ ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ తెలంగాణ భవన్‌లో బుధవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. అలాగే నియోజవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ కార్యకర్తలకు అండగా ఉండాలని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు.

## పకడ్బందీగా నిర్వహించాలి..

ఇచ్చోడ, జనవరి 3 ః ఆరు గ్యారెంటీల పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ, తలమద్రి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో రమేశ్, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్‌లతో ఆర్జీయూకేటీ విద్యార్థులు

## ఆర్జీయూకేటీలో ఉన్నతస్థాయి సమీక్ష

బాసర, జనవరి 3 : బాసర ఆర్జీయూకేటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రిపుల్ ఐటీ వైస్ చాన్స్‌లర్ వెంకటరమణ ముఖ్యఅతిథిగా పాల్గొని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, వివిధ శాఖ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల పని తీరు, నిర్వహణ, చేస్తున్న పని, విధుల గురించి ఆరా తీశారు. భోజనశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహాలను సందర్శించి సూచనలు చేశారు.

### ల్యాప్‌టాప్‌ల పంపిణీ

ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న 1,200 మంది విద్యార్థులకు డైరెక్టర్ సతీశ్‌కుమార్‌తో కలిసి వీసీ వెంకటరమణ ల్యాప్‌టాప్‌లను అందజేశారు. విద్యార్థులు సాంకేతికను పెంపొందించుకోవడానికి ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

## పారిశుధ్య కార్మికుల దీక్ష

- న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్
- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

నిర్మల్ అర్బన్, జనవరి 3 : నిర్మల్ పట్టణంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం నుంచి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాం డ్ చేస్తూ దీక్ష చేపట్టారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం బల్దియా కమిషనర్ రాజుకు వినతిపత్రం అందించారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. శానిటరీ విభాగంలో పని చేస్తున్న 190 మందికి, ఇంజినీరింగ్ సెక్షన్‌లో 86, నూతన లేబర్లు 45, డ్రైవర్లు 15 మందికి జీతాలు, పీఆర్‌సీ, పీఎఫ్ రావడం లేదని పేర్కొన్నారు. ప్రతినెలా 1-5వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఫయాజ్, వంశీ, రాహుల్, రమేశ్, ముత్యం, పురుషోత్తం, ముక్రం పాల్గొన్నారు.




కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయించిన దళిత సంఘం నాయకులు

## దళితుల ఆందోళన

**ఆదిలాబాద్ జిల్లా మావల** మండల కేంద్రానికి చెందిన దళిత యువకుడు ఎంబడి వంశీపై హత్యాయత్నం చేసిన బీజేపీ వార్డు కౌన్సిలర్ రఘుపతిని అరెస్టు చేయాలి అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాటాల సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట బైఠాయించారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత సంఘా ల నాయకులు మాట్లాడుతూ.. బాధిత కు టుంబానికి న్యాయం జరగకపోతే.. ఈనెల 6వ తేదీన ఆదిలాబాద్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూ రి భూమన్న, అగ్గిమల్ల గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

- ఎదులాపురం, జనవరి 3

## ప్రజాపాలనను పరిశీలించిన కలెక్టర్

భైంసా టౌన్, జనవరి 3 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని ఖత్‌గాంలో బుధవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. అర్జీదారులు ఇచ్చే దరఖాస్తుల్లో అన్ని వివరాలు నమోదు చేశారా? లేదా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు స్వీకరించిన వెంటనే రిజిస్టర్‌లో నమోదు చేసి రశీదు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో కోమల్‌రెడ్డి, డీఎల్‌పీవో శివకృష్ణ, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీవో మోజమ్ హుస్సేన్, సర్పంచ్ రాజు ఉన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్